## గంజాయి పట్టివేత

బెల్లంపల్లి, జూన్ 21: బెల్లంపల్లిలోని కాల్ టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద 1078 గ్రాముల గంజాయిని శనివారం టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ అఫ్జలుద్దీన్ సంబంధిత కేసు వివరాలను వెల్లడించారు. కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఎస్‌కే ముజ్జు మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి బెల్లంపల్లికి గంజాయిని సరఫరా చేస్తున్నాడనే ముందస్తు సమాచారం మేరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు మాటు వేసి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా కనిపించిన ముజ్జును పట్టుకుని అతడి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా అందులో రూ.26,950 విలువ గల కిలో 78 గ్రాముల గంజాయి పట్టుబడిందని పేర్కొన్నారు. బల్లార్షాలో ఓ వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణ వెల్లడైందన్నారు. వీరు బెల్లంపల్లిలో యువతకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తేలింది. ఇప్పటికైనా అధికారులు ముమ్మరంగా తనిఖీ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

చెన్నూర్ టౌన్, జూన్ 21 : చెన్నూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో శనివారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వేమనపల్లి మండలం గొర్లపల్లికి చెందిన కనకయ్య (39) చికిత్స తీసుకొని స్థానిక బస్టాండుకు వచ్చాడు. అక్కడ రక్తం కక్కుకొని స్పృహ తప్పి పడిపోయాడు. పరిస్థితిని గమనించిన స్థానికులు ఆర్టీసీ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించి, పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు చెన్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు లేరని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

వాంకిడి,జూన్ 21 : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వాంకిడి మండల కేంద్రంలోని శివ కేశవ నగర్‌లో జరిగినట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వాంకిడి మండల కేంద్రంలోని శివ కేశవ నగర్‌కు చెందిన ఇటాన్ కార్ శంకర్(27)కు నాలుగేళ్ల క్రితం శివ కేశవ నగర్‌కి చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. కొద్దిరోజులుగా శంకర్ మద్యానికి బానిసై భార్యతో గొడవలు పడేవాడు. దీంతో ఆమె 2 నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. దీంతో ఈ నెల 18 శంకర్ మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగు మందు తాగాడు . దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 9:30లకు మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

## అధిక శబ్దాలు చేసే బైక్ సైలెన్సర్లపై నిఘా

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 21: అక్రమంగా అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లు అమర్చిన ద్విచక్ర వాహనాల్లో నిఘా పెట్టి వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ పట్టణ సీఐ రవీందర్ శనివారం హెచ్చరించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ మోటర్ వాహన చట్టాలకు లోబడి సైలెన్సర్లు ఉండాలని చట్టాలకు వ్యతిరేకంగా అధిక శబ్దాలు చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధమైన సైలెన్సర్లు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి వాహనాల కోసం ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

## 'మునీర్ సేవలు చిరస్మరణీయం'

మందమర్రి, జూన్ 21: సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుడు దివంగత మునీర్ సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు సీనియర్ పాత్రికేయులు కొనియాడారు. మందమర్రి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంతాప సభ నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు పోతుల పరందాం కుమార్, హనుమండ్ల రవీందర్, చందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ.అబ్బాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, విలేకరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, జూన్ 21 : యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రాజేశ్వరి తెలిపారు. ఏదైనా గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనకబడిన తరగతుల నిరుద్యోగులు జూలై 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 13న పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు టీఎస్ఎస్‌స్టడీసర్కిల్.సీవో.ఇన్‌లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజాసమస్యలపై పోరాటమే లక్ష్యం

- కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనమనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

మంచిర్యాల అర్బన్, జూన్ 21: ప్రజా సమస్యలు, హక్కులపై పోరాటాలు, పేద వర్గాల విజయాలు, కార్మికుల, రైతుల కోసం ఎన్నో వర్గాలకు దశ దిశ చూపించిన గొప్ప పార్టీ భరత కమ్యూనిస్టు పార్టీ అని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనమనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని ఎం కన్వెన్షన్ హాల్లో జిల్లా స్థాయి నాలుగవ మహాసభలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సీపీఐ చరిత్ర, పోరాటాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కలిసి చర్చించి గోదావరి నీటి వాటపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆపరేషన్ కగార్ను వెంటనే నిలిపివేయాలని వారితో శాంతి చర్చలు జరపాలని బీజేపీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా స్థాయి నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహన

దండేపల్లి, జూన్ 21 : గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఈ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జనార్దన్ అన్నారు. గిరిజన సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జన్ జాతి న్యాయ మహా అభియాన్‌పై మండలంలోని లింగాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జీవరత్నం, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో విజయ ప్రసాద్ తదితరులున్నారు.

## ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలి

లక్షెట్టిపేట, జూన్ 21 : ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం చాలా ఉందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్జీవో శ్రీధర్ సూచించారు. శనివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరయ్యారు. అనంతరం పలు అంశాలపై ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, ఏటీపీ తిరుమల్, పాఠశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలి

జైపూర్, జూన్ 21: రోడ్లపై రహదారుల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఇందారం, టేకుమట్ల, వేలాల గ్రామాల్లో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావుతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లోని అంతర్గత రహదారుల వెంట, మురుగుకాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. అనంతరం ఇందారం రైతువేదిక వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు ఆర్ శ్రావణి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

హాజీపూర్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు చెన్నూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొమ్మెర రాజేశ్ రూ.50 వేల విలువ కలిగిన 9 సైకిళ్లను పాఠశాలకు అందించారు. ఎస్ఐ స్వరూప్‌రాజ్, ఎస్బీఐ సీనియర్ మేనేజర్ సాగర్, ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, షీటీం సిబ్బంది జ్యోతి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ తోటల పరిశీలన

జన్నారం,జూన్ 21 : మండలంలోని దేవునిగూడలో ఆయిల్ ఫామ్ క్షేత్రాల ఉద్యానవన అధికారి సహజ పరిశీలించారు. గ్రామంలోని గుర్రం గోపాల్ రెడ్డి, బాపురెడ్డి, వెంకటి, బుచ్చన్న సాగుచేసిన ఆయిల్ పామ్ క్షేత్రాలను పరిశీలించి మాట్లాడారు. తోటల్లో మూడు సంవత్సరాల వరకు ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలని, ప్రస్తుతం 5 ఎకరాల్లోపు పండ్ల తోటలను సాగు చేసే రైతులకు మొక్కలను సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఉదయ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశ్, రైతులు ఉన్నారు.

## ఆర్థిక సహాయం

మంచిర్యాల అర్బన్, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం కోలుకుంటున్న మిత్ర మెకానిక్ సాగర్ మంచిర్యాల టూ వీలర్ మెకానిక్స్ అండ్ వర్కర్స్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.6300 ను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం తన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెకానిక్‌లకు ఏదైనా జరిగితే యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ అధ్యక్షుడు కరకంటి రవీందర్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ చారి, పుట్ట రాజ్‌కుమార్, కార్యదర్శులు రామగిరి శ్రీనివాస్, మల్క ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ఘనంగా యోగా దినోత్సవం



యోగాసనం వేస్తున్న జీఎం ఎం శ్రీనివాస్, ఉద్యోగులు

శ్రీరాంపూర్/జైపూర్/మందమర్రి/రెబ్బెన జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా గనులు, ఓసీపీపై కార్మికులు, అధికారులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో జీఎం ఎం శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి యోగా దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం యోగా గురువు సాంబయ్య జీఎం ఆఫీస్ ఉద్యోగులు, అధికారులచే యోగాపై యోగా ప్రతిజ్ఞ చేయించి యోగా ఆసనాలు వేయించారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, ఏజీపీ వెంకటేశ్వర్లు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్, పలువురు అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు. మందమర్రిలోని సింగరేణి పాఠశాల ఆవరణతో పాటు జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణ, ఇల్లందు క్లబ్‌లో లేడీస్ క్లబ్, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆయుష్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మందమర్రి ఏరియా జీఎం జీ.దేవేందర్, సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆయూశ్ విభాగం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నీరజ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి సింగరేణి హైస్కూల్ క్రీడా మైదానంలో 400 మంది ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, సింగరేణి సేవా సభ్యులు, యూనియన్ నాయకులు యోగా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా గురువులను సన్మానించి జ్ఞాపికలు అందించారు.



గోలేటి సింగరేణి హైస్కూల్‌లో జీఎం విజయభాస్కర్‌రెడ్డి, ఉద్యోగులు



హాజీపూర్ : యోగా చేస్తున్న బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు



ఆసిఫాబాద్‌లో యోగాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్

# ఉత్సాహంగా యోగా డే

- యోగాసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు , ప్రజలు

నమస్తే నెట్ వర్క్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వివిధ శాఖల కార్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో ఉన్న 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పీ వెంకట్రాములు, అధికారుల ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ ధ్యాన యోగా సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు, సిబ్బంది యోగా డేలో పాల్గొన్నారు. హైటెక్ కాలనీలోని ఓపెన్ జిమ్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి యోగా విన్యాసాలు చేశారు. కార్పొరేషన్ కమిషనర్ తౌటం శివాజీ పాల్గొన్నారు. మంచిర్యాలలో పట్టణంలోని వైశ్య భవన్‌లో యోగ గురువు జ్యోత్స్న చంద్రదత్ ఆధ్వర్యంలో వనిత వాక్కు ఫౌండేషన్ సభ్యులు యోగా డే నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ పోలీస్ ఆధ్వర్యంలో రామగుండంలోని పోలీస్ పరేడ్ మైదానంలో యోగా డేలో సీపీ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ సిబ్బంది అధికారులు యోగాసనాలు వేశారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ లో డీఎంహెచ్‌వో హరీష్ రాజ్, ఏసీపీ ప్రకాశ్, సిబ్బందితో కలిసి డీసీపీ భాస్కర్ యోగా, వ్యాయామం చేశారు. చెన్నూర్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆసనాలు వేశారు. చెన్నూర్ రైతువేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏడీఏ బానోత్ ప్రసాద్ పాల్గొన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధారి వనం అర్బన్ పార్క్‌లో గాంధారి వనం వాకర్స్ అసోసియేషన్, జిల్లా అటవీశాఖ సిబ్బంది సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మందమర్రి మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో యోగాసనాలు వేయించారు.

బెల్లంపల్లిలో రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులకు యోగా చేయించారు. కార్యక్రమంలో డీఎంవో ప్రణీత, శ్యాం, వెంకట్రావ్, ఇనిస్టిట్యూట్ చైర్మన్ గోపీ, కార్యదర్శి రమేశ్, జాయింట్ సెక్రటరీ సాల్మన్ , సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు. తాండూర్ సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం, భీమిని ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, విజయ్‌కుమార్ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి సామూహిక యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని తంగళ్లపల్లి హైస్కూల్, రేచిని పాఠశాలలో, తాండూర్ పీహెచ్‌సీ ఆయష్ దవాఖానలో, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఎంఈవో ఎస్ మల్లేశం, పీహెచ్‌సీ డాక్టర్ ఝాన్సీ, ఆయుష్ డాక్టర్ శ్రుతి, అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు, యోగా సాధకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను సీసీసీ నస్పూర్‌లోని రేడియంట్, రెయిన్‌బో పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. యోగా డే సందర్భంగా శనివారం పాఠశాలల కరస్పాండెంట్ చెన్నూరి అమాన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రజినీ, యోగా శిక్షకురాలు రమ్య ఆధ్వర్యంలో యోగా శిక్షకులు విద్యార్థిని, విద్యార్థులతో భారతదేశ చిత్రపటం ఆకారంలో నిలుచొని యోగాసనాలు వేయించడం ఆకట్టుకున్నది.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు, ఉద్యోగులతో కలిసి కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే యోగాసనాలు వేశారు. సబ్ జైలులో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్ ఖైదీలతో యోగాసనాలు వేయించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వాటర్స్ లో ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్ నగర్ డీఎస్పీ రామానుజం, తదితరులు ఉన్నారు. కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి ఎం.వీ రమేశ్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ తో కలిసి ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాసనాలు వేశారు. కెరమెరి మండలంలోని మన్నేగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో యోగా డేలో సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి పాల్గొన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని వల్లకొండ గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో కోట ప్రసాద్ శనివారం పరిశీలించారు.



సీసీసీ రేయిన్‌బో స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



తాండూర్‌లో యోగా చేస్తున్న అధికారులు, వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు

## బీఎల్వోలకు శిక్షణ ఇవ్వాలి



తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస రావు

హాజీపూర్, జూన్ 21 : బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వో)లకు పూర్తి స్థాయి శిక్షణను ఇవ్వాలని మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లాలోని పలువురు తహసీల్దార్లతో, నాయబ్ తహసీల్దార్లతో ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు, సవరణ, తొలగింపు, తదితర ఫారాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం నాయబ్ తహసీల్దార్ గడియారం శ్రీహరి, దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, లక్షెట్టిపేట నాయబ్ తహసీల్దార్ శ్రావణి, హాజీపూర్ నాయబ్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, నస్పూర్ నాయబ్ తహసీల్దార్ హరిత, మంచిర్యాల తహసీల్దార్ రఫత్ హుస్సేన్, మంచిర్యాల నాయబ్ తహసీల్దార్ వివిర్‌కెడి ప్రసాద్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను ప్రారంభించాలని వినతి

దండేపల్లి, జూన్ 21 : దండేపల్లి మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామంలో మూత పడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించాలని ఎంఈవో దుర్గం చిన్నయ్యకు గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. పాఠశాలను తిరిగి ప్రారంభిస్తే విద్యార్థులను పాఠశాలకు పంపుతామని హామీ ఇచ్చారు.

## బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు




మాట్లాడుతున్న జడ్జి సాయికిరణ్

దండేపల్లి, జూన్ 21 : బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు లక్షెట్టిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కాసమల్ల హెచ్చరించారు. దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మదర్ థెరిసా పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమటి రెడ్డి సత్తన్న, న్యాయవాదులు సురేందర్, రాజేశ్వర్‌రావు, శ్రీధర్, పద్మ, శివ తదితరులు పాల్గొన్నారు.


## ఎస్టీపీపీకి మరో అవార్డు

జైపూర్, జూన్ 21: జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రానికి మరో అవార్డు వరించింది. ప్లాంటులో చేపడుతున్న పర్యావరణ రహిత చర్యలకుగాను ఈ అవార్డు అందుకున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో కౌన్సిల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో 'బెస్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఎక్సలెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. ఈ అవార్డును సింగరేణి తరపున వీరబ్రహ్మం డీజీఎం (సిస్టం ఆఫ్ ఎఫిషియెన్సి) అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందకెళ్ళాలని సూచించారు. ఈ అవార్డు రావడంపై డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

# జయశంకర్ సార్ సేవలు మరువలేనివి



నస్పూర్‌లో జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు



ఆసిఫాబాద్‌లో..

సీసీసీ నస్పూర్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు ఎన్నటికి మరువలేనివని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి క్షీణించిపోయిందని, ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే కేసులతో భయాభ్రాంతులకు గురిచేస్తుందని ఆరోపించారు. జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, గాదె సత్యం, నాయకులు మేరుగు పవన్, వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, గోగుల రవీందర్‌రెడ్డి, గర్శె రామస్వామి, హైమద్, కుర్మిళ్ల అన్నపూర్ణ, పంబాల గంగాఎర్రయ్య, బాకం నగేశ్, కాటం రాజు, జాడి భానుచందర్, పొగాకు రమేశ్, పెట్టం లక్ష్మణ్, జక్కుల కుమార్, పెద్దపల్లి కోటిలింగం, అడ్లకొండ రవిగౌడ్, బండారి తిరుపతి, తోట దుర్గాప్రసాద్, అమృత రాజ్‌కుమార్, కందుల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్, జూన్ 21:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కీ.శే. కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకొని విఠల్‌నగర్ తీన్‌రాస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రామిడి కుమార్, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, జాడి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిలో..**

మందమర్రి, జూన్ 21: మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తా వద్ద శనివారం ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతి వేడుకలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, బండారు సూరిబాబు, ఓ.రాజశేఖర్, బత్తుల శ్రీనివాస్, ఎండి.అబ్బాస్, బోరిగం వెంకటేశ్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, భూపెల్లి కనకయ్య, బర్ల సదానందం, పల్లె నర్సింగ్, అఖిలేశ్ పాండే, దాసరి రాజనర్సు, కోడెం శ్రీనివాస్, సీసెల్లి సాగర్, సంతోశ్, తిరుపతి, మహిళా నాయకులు ఎనగందుల లక్ష్మి, రమ, కల్లెపెల్లి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ జిల్లాలో..**

ఆసిఫాబాద్ టౌన్, జూన్21: ఆసిఫాబాద్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో శనివారం ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) ఐక్య సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి భాస్కరాచారి,బట్టుపల్లి అశోక్ చారి, గౌరవ అధ్యక్షులు తుమోజు సురేశ్ చారి, జిల్లా నాయకులు శ్రీమంతుల వేణుగోపాలాచారి, శ్రీరామోజు వెంకటయ్య చారి, రాధాకృష్ణ చారి, కస్తూరి రమేశ్, గద్దెల పెల్లి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలను పరిష్కరించాలి



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

వాంకిడి, జూన్ 21 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశించారు. శనివారం వాంకిడి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు, రికార్డులు, సిబ్బంది విధులు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదగా మెలగాలని ఫిర్యాదులను తక్షణమే విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ వెంట వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రశాంత్ తదితరులున్నారు.

## మహిళల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కొట్నాక విజయ్ కుమార్

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 21: ఆదివాసీ మహిళలను అక్రమ రవాణా పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల అమాయక గిరిజన మహిళలకు మాయ మాటలు చెప్పి మధ్యప్రదేశ్‌లో అమ్మివేసిన ఘటన నేపథ్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆదివాసీ మహిళలపై చిన్నచూపు చూస్తున్నదని ఆరు నెలల్లో దాదాపు 60 మంది మహిళలను అక్రమ రవాణా చేస్తే ఇప్పటికీ ఇలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అక్రమ రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ ఉన్నారు.

## నకిలీ సర్టిఫికెట్‌పై విచారణ జరపాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 21: నకిలీ ఎస్సీ సర్టిఫికెట్ తో జిల్లా వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రావూరి శ్రీనివాస్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు దుర్గం దినకర్, గోడిసెల కార్తీక్ శనివారం హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ అదనపు కమిషనర్, డైరెక్టర్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన అధికారి తనది ఎస్సీ కులమని చెబుతూ ఉన్నతాధికారులను నమ్మించి, ప్రభుత్వ యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి క్రిమినల్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం

దహెగాం,జూన్ 21: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేదోళ్లకు సొంతింటి కల సాకారం అవుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం మండలంలోని ఇట్యాల, కోత్మీర్, దహెగాం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, ఏఈ సందీప్, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామరావు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పోతుగంటి భీమన్న, నాయకులు గజ్జల సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



దవాఖాన సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్, జూన్ 21: కాగజ్‌నగర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో(టీవీవీపీ)లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి చెందిన పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, కార్మికుల పీఎఫ్ పూర్తి వివరాలు అందజేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా చేసి అనంతరం దవాఖాన సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ చెన్నకేశవకు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించని, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు కట్టని కాంట్రాక్టర్‌పై గతంలో చాలా సార్లు ఫిర్యాదు చేసిన అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ కట్టని కాంట్రాక్టర్, ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది ఇమ్రాన్, సాయి , తిరుమల, పుష్ప, మీనాక్షి తోపాటు తదితరులు పాల్గొన్నారు

## ఎంజేపీ విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు

కాగజ్‌నగర్, జూన్ 21: కాగజ్‌నగర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థి కే చరణ్ ఇటీవలే విడుదలైన నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. ఈ నేపథ్యంలో విద్యాలయం ప్రిన్సిపాల్ మంగ, ఉపాధ్యాయురాలు అనిత, ఆసియా, పార్వతి, ఆస్మా, రాజేశ్వరి విద్యార్థికి శాలువతో ఘనంగా సన్మానించారు.

## గిరిజనుల సమగ్రాభివృద్ధికే 'పీఎం జుగా'

కెరమెరి, జూన్ 21: గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్(జుగా)ను ప్రవేశపెట్టిందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. శనివారం కెరమెరి మండలంలోని కొటారి గ్రామంలో సమావేశం నిర్వహించి అవగాహన ర్యాలీ తీశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషా, ఎస్సీఈఆర్పీ చహకటి శ్యాంరావ్, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రిని కలిసిన గో సంరక్షణ కమిటీ

రెబ్బెన, జూన్ 21:కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను శనివారం కరీంనగర్‌లో రాధాకృష్ణా గోశాల అధ్యక్షుడు దిలీప్ పట్లెవార్ ఆధ్వర్యంలో కలిసినట్లు ప్రధాన కార్యదర్శి భీంరావు తెలిపారు. రెబ్బెన మండలం పాసిగాంలో ఏర్పాటు చేయనున్న రాధాకృష్ణా గోశాల వివరాలు వెల్లడించి గోశాల నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, దొందుజీ దండ్రే, తిరుపతి, వెంకటి, శ్రీనివాస్, రాకేశ్, కృష్ణ, తదితరులున్నారు.